అమృత్ తెలంగాణ
తెలుగు దిన పత్రిక

## సింహాలతో మోడీ చెలిమి..

హైదరాబాద్: అమృత్ తెలంగాణ:గాయపడిన, ఇబ్బందుల్లో ఉన్న జంతువులను సంరక్షించే లక్ష్యంతో 'వంతారా' కార్యక్రమాన్ని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, రిలయన్స్ ఫౌండేషన్ డైరెక్టర్ అనంత్ అంబానీ ప్రారంభించిన విషయం తెలిసిందే. వన్యప్రాణుల రక్షణ, పునరావాసం, సంరక్షణ కేంద్రమైన ఈ వంతారాను మోడీ మంగళవారం సందర్శించారు. ప్రధాని మోడీ ప్రస్తుతం తన సొంత రాష్ట్రం గుజరాత్‌లో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. సోమవారం ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం సందర్భంగా గిర్ అడవుల్లో సఫారీకి వెళ్లారు. ఇవాళ జామ్‌నగర్‌లోని వంతారాను సందర్శించారు. వన్యప్రాణుల ఆసుపత్రిని, జంతువుల కోసం ఏర్పాటు చేసిన MRI, CT స్కాన్‌లు, ICUలు మొదలైన వాటితో కూడిన పశువైద్య సౌకర్యాలను వీక్షించారు. అంతే కాకుండా వైల్డ్‌లైఫ్ అనస్థీషియా, కార్డియాలజీ, నెఫ్రాలజీ, ఎండోస్కోపీ, డెంటిస్ట్రీ, ఇంటర్నల్ మెడిసిన్ మొదలైన అనేక విభాగాలను కూడా పరిశీలించారు.

## ప్రముఖ గాయని కల్పన ఆత్మహత్యాయత్నం

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: ప్రముఖ సింగర్ కల్పన ఆత్మహత్యాయత్నం చేసుకున్నారు. ఆమె నిద్రమాత్రలు మింగినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఆమెను ప్రయివేటు ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నిజాంపేటలోని వర్టెక్స్ ప్రీవిలేజ్ అపార్ట్‌మెంట్‌లో కల్పన ప్రస్తుతం నివసిస్తున్నారు. రెండ్రోజులుగా ఆమె ఇంటి తలుపులు తెరవకపోవడంతో అనుమానంతో అపార్ట్‌మెంట్ వాసులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు కల్పన ఉంటున్న ఇంటి తలుపులు పగులగొట్టి చూడగా ఆమె అపస్మారక స్థితిలో ఉన్నారు. దాంతో కల్పనను నిజాంపేటలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమెకు ప్రాణపాయం తప్పినట్టు పోలీసులు తెలిపారు. ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియరాలేదు. అయితే, అనారోగ్య సమస్యలతో నిద్రమాత్రలు మింగినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సంపుటి: 01 సంచిక : 158. ఎడిటర్: సింగిడి అమృత్ తెలంగాణ బుధవారం.05.03.2025 పేజీలు:4, వెల:రూ.1.00

# రెండు దఫాలా? ఒకేసారా?

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: బీసీ కుల గణనతోపాటు ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించటం, రాబోయే ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను ప్రతిపాదించటం రాష్ట్ర ప్రభుత్వానికి రాబోయే రెండు మూడు వారాల్లో ఇవి కీలకాంశాలు. ఇందుకోసం అసెంబ్లీ సమావేశాలను నిర్వహించాలి. ఈ మేరకు ఇటీవలే శాసనసభ, మండలిని ప్రొరోగ్ చేస్తూ గవర్నర్ గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఈనెల మొదటి వారంలోనే అసెంబ్లీని సమావేశపరుస్తారని అందరూ భావించారు. కానీ ఆ దిశగా ప్రభుత్వంలో ఇప్పటిదాకా కదలికల్లేకపోవటం గమనార్హం. ముఖ్యమంత్రి రేవంత్ ఉన్నత స్థాయి సమీక్షలు, ఢిల్లీ పర్యటనలతో బిజీగా ఉండగా, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, జూపల్లి తదితరులు ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదానికి సంబంధించిన సహాయక చర్యలపై పూర్తి స్థాయిలో దృష్టి సారించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బడ్జెట్‌కు ముందు వివిధ శాఖలతో నిర్వహించే ప్రతిపాదిత సమావేశాలతో బిజీగా ఉన్నారు. వాస్తవానికి కులగణన, ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించేందుకు వీలుగా ఈనెల మొదటి వారంలోనే అసెంబ్లీని నిర్వహిస్తామంటూ ప్రభుత్వం గత నెలాఖరులో ప్రకటించింది. అందుకనుగుణంగా క్యాబినెట్ భేటీ ఉంటుందని తెలిపింది. ఆ మేరకు గురువారం ముఖ్యమంత్రి రేవంత్ అధ్యక్షతన మంత్రివర్గ సమావేశాన్ని నిర్వహించనున్నారు. కులగణన, ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత, దానికి న్యాయపరంగా ఎలాంటి చిక్కుల్లేకుండా చూసుకోవటం తదితరాంశాలపై క్యాబినెట్‌లో కూలకుశంగా చర్చిస్తారని సమాచారం. ఆ తర్వాత ఈ రెండింటి చట్టబద్ధత కోసం త్వరలోనే (ఈనెల పదిలోపు) అసెంబ్లీని సమావేశపరుస్తారని ఒక అధికారి తెలిపారు. ఈ రెండింటికీ అసెంబ్లీలో చట్టబద్ధత కల్పించిన తర్వాత సభను ఒక వారంపాటు వాయిదా వేస్తారని సమాచారం. అనంతరం సీఎం ఢిల్లీకి వెళ్లి ప్రధానిని కలుస్తారనే చర్చలు కూడా కొనసాగుతున్నాయి. కులగణన, ఎస్సీ వర్గీకరణపై తాము తీర్మానం




చేసిన దరిమిలా కేంద్రం కూడా పార్లమెంటులో ఆ మేరకు తీర్మానించాలంటూ ఆయన ప్రధానిని కోరనున్నారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈనెల 10 నుంచి పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు తిరిగి ప్రారంభం కానున్న నేపథ్యంలో దానికి కొద్ది రోజులు అటుఇటుగా (15 నుంచి 20లోపు) మళ్లీ అసెంబ్లీని సమావేశపరిచి బడ్జెట్‌ను ప్రతిపాదించేందుకు సీఎం సమాలోచనలు చేస్తున్నారని వినికిడి. అయితే వీటన్నింటికి సంబంధించి అటు అసెంబ్లీ వర్గాల నుంచి గాని, ఇటు ముఖ్యమంత్రి కార్యాలయం వైపు నుంచి గానీ ఎలాంటి స్పష్టత రాలేదు. గురువారం నాటి క్యాబినెట్ తర్వాత దీనిపై మరింత క్లారిటీ వచ్చే అవకాశముంది.

# మహిళా సంఘాలకు ఆర్టీసీ అద్దె బస్సులు

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: మహిళా సంఘాలకు ఆర్టీసీ అద్దె బస్సుల్ని కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మొదటి విడతలో 150 మండల సమాఖ్యలకు 150 ఆర్టీసీ అద్దె బస్సుల్ని ఇవ్వాలనీ, ఆ తర్వాత మిగిలిన మండల సమాఖ్యలకు 450 ఆర్టీసీ అద్దె బస్సులు ఇవ్వాలని నిర్ణయించారు. ప్రతి నెల ఒక్కో బస్సుకు అద్దె రూపంలో ఆర్టీసీ రూ.77, 220 చెల్లిస్తుందని పేర్కొన్నారు. బస్సుల కొనుగోలు కోసం మహిళా సంఘాలకు ప్రభుత్వం బ్యాంకు గ్యారంటీ ఇస్తుంది. దేశంలో తొలిసారిగా మహిళా సంఘాలకు అద్దె బస్సుల్ని అందిస్తున్నామని ప్రభుత్వం ప్రకటించింది. ఈనెల 8వ తేదీ మహిళా దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్‌లోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ వేదికగా 50 బస్సులను ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క,



మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ కూడా పాల్గొంటారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఒక్కో బస్సు విలువ రూ.36 లక్షలు ఉంటుందనీ, ఒక్కో మండల సమాఖ్యకు ఒక బస్సును కొనుగోలు చేసి ఆర్టీసికి అద్దె ఇస్తారని వివరించారు. తొలివిడతలో ఉమ్మడి మహబూబ్‌నగర్, ఖమ్మం, వరంగల్, కరీంనగర్ జిల్లాల మహిళా సమాఖ్యలకు 150 అద్దె బస్సులను అప్పగించనున్నారు. ఈ బస్సులపై ఇందిరా మహిళా శక్తి ప్రధాన్యతను చాటి చెప్పేలా డిజైన్లు రూపొందించారు.

# ప్రభుత్వ భూముల అమ్మకానికి సర్కారు కుట్ర

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: ప్రభుత్వ భూముల అమ్మకానికి రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఒక ప్రకటనలో విమర్శించారు. అసెంబ్లీ సాక్షిగా ప్రజలను తప్పుదోవ పట్టించిన సర్కార్ వెంటనే క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. "ప్రభుత్వ భూములంటే పెద్దలిచ్చిన ఆస్తి. తెలంగాణ జాతి సంపద. ఆ భూములను అమ్మితే భవిష్యత్‌లో శ్మశానాలు నిర్మించాలంటే కూడా భూమి లేకుండా పోతుందని నాడు పీసీసీ అధ్యక్షుడి హొదాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మొసలి కన్నీరు కార్చిండు. తాము అధికారంలోకి వస్తే ఇంచు ప్రభుత్వ భూమిని కూడా అమ్మబోమంటూ ఎన్నికల సమయంలో వాగ్దానాలు చేసిండు. ప్రస్తుతం రూ.20 వేల కోట్ల విలువైన భూములను వేలం వేసేందుకు తెరలేపిండు" అని హరీశ్‌రావు విమర్శలు గుప్పించారు. నిధుల సమీకరణ పేరుతో కారు చౌకగా భూములను అమ్ముతుండటం కాంగ్రెస్ ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనమని ఆరోపించారు. మాస్టర్ ప్లాన్ పేరిట వేలం పాట నిర్వహించేందుకు కన్సల్టెంట్ నియామకానికి (ఆర్ఎఫ్‌పీ) గత నెల 28న టెండర్లు పిలవడం ప్రభుత్వ దిగజారుడు తనానికి పరాకాష్ట అని వ్యాఖ్యానించారు. "కంచ గచ్చిబౌలి గ్రామం సర్వే నంబర్ 25 పరిధిలోని 400 ఎకరాలను బ్యాంకర్లకు తనఖా పెట్టిన సమయంలో ప్రభుత్వం రూ. 25 కోట్లకు ఎకరం చొప్పున రూ.10వేల కోట్లు ఇప్పటికే సమీకరించింది. బ్యాంకులో తనఖా పెట్టిన అవే భూములనే వేలం వేసి అమ్ముకోవడం ప్రభుత్వ దివాలాకోరు తనానికి నిదర్శనం" అని ఆయన విమర్శించారు. అసెంబ్లీని తప్పుదోవ పట్టించారు. "జూన్ 26, 2024న విడుదల చేసిన జీవో ఎంఎస్ 54తో ఎకరానికి రూ. 75 కోట్ల చొప్పున మొత్తం 30వేల కోట్ల విలువైన భూములను అమ్ముతున్నారని



నేను అసెంబ్లీలో నిలదీస్తే.. అలాంటిదేమి లేదని, టీజీఐఐసీకి చేస్తున్న భూ బదలాయింపు మాత్రమేనని బుకాయించారు. నిండు సభలో ముఖ్యమంత్రి సహా మంత్రులు తప్పుడు సమాధానం చెప్పి, సభను, సభ్యులను తప్పుదోవ పట్టించారు. అసెంబ్లీ అయ్యిందో, లేదో వెంటనే అదే భూమిని తనఖా పెట్టి రూ. 10వేల కోట్ల రుణం తెచ్చుకున్నరు. తిరిగి అసెంబ్లీ మొదలయ్యే లోపే ఇప్పుడు అదే భూమి అమ్మకానికి టెండర్లు పిలుస్తున్నారు. భూముల అమ్మకంపై అసెంబ్లీని తప్పుదోవ పట్టించారు. సర్కార్ భూముల అమ్మకం ప్రక్రియను వెంటనే ఉపసంహరించుకోవాలి" అని హరీశ్ డిమాండ్ చేశారు.

# బకాయిలు చెల్లించండి

న్యూఢిల్లీ : అమృత్ తెలంగాణ: ఎఫ్‌సీఐ 2014-15 ఖరీఫ్ కాలంలో సరఫరా చేసిన బియ్యానికి సంబంధించి తెలంగాణకు బకాయి పడిన రూ.1,468.94 కోట్లను వెంటనే విడుదల చేయాలని కేంద్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం కేంద్ర మంత్రిని ఆయన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కలిశారు. నాడు అదనపు లెవీ సేకరణకు సంబంధించిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించిందని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. బకాయిలు పెట్టి పదేండ్ల యిందని, వాటిని వెంటనే విడుదల చేయాల ని కోరారు. ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ యోజన కింద 2021 మే నుంచి 2022 మార్చి వరకు సరఫరా చేసిన అదనపు బియ్యం, 2022 ఏప్రిల్‌లో సరఫరా చేసిన బియ్యానికి సంబంధించిన ఉత్తర్వులను ధ్రువీకరించుకొని, అందుకు సంబంధించిన బకాయిలు రూ.343.27 కోట్లను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. 2021 జూన్ నుంచి 2022 ఏప్రిల్ వరకు నాన్ ఎన్ఎఫ్ఎస్ఏ (నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్) కింద పంపిణీ



చేసిన బియ్యానికి సంబంధించిన బకాయిలు రూ.79.09 కోట్లు వెంటనే విడుదల చేయాలని కోరారు. సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) గడువును నెలా నెలా కాకుండా కనీసం నాలుగు నెలలు పొడిగించాలని, అప్పుడే సరఫరాలో ఎటువం టి ఇబ్బందులు తలెత్తవని తెలియజేశారు.

4 వేల మెగావాట్ల సోలార్ విద్యుదుత్పత్తికి అనుమతులు పునరుద్ధరించండి : సీఎం

తెలంగాణ రాష్ట్రానికి పీఎం కుసుమ్ కింద గతంలో ఇచ్చిన 4 వేల మెగావాట్ల సోలార్ విద్యుదుత్పత్తికి అనుమతులను పునరుద్ధరించాలని కేంద్ర పునరుత్పాదక ఇంధన వనరుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణకు గతంలో నాలుగు వేల మెగావాట్లకు అనుమతులు ఇచ్చిన కేంద్రం తర్వాత దానిని వెయ్యి మెగావాట్లకు కుదించిందని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రంలో మహిళా సంఘాలతో సోలార్ విద్యుదుత్పత్తిని ప్రోత్సహిస్తున్నామని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. వారి విజ్ఞప్తులపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. సమావేశంలో ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి మాణిక్‌రాజ్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డి.ఎస్ చౌహాన్, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

# కృష్ణాజలాలపై తెగని జగడం

## తెలంగాణకు ఆశనిపాతం- ఏపీకి ఫలహారం

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: దేశంలోని నదుల్లో నాలుగో పెద్దనది కృష్ణ. మహారాష్ట్ర, కర్నాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ గుండా ప్రవహిస్తున్న ఈ నది పొడవులో గంగ, బ్రహ్మపుత్ర, గోదావరి నదులు తరువాతి స్థానంలో ఉంటుంది. దాదాపు 1300 కిలోమీటర్లు ప్రవహించే ఈ నది, మహారాష్ట్ర నుంచి కర్నాటక, అక్కడి నుంచి తెలంగాణ, ఆ తరువాత ఏపీలోకి ప్రవహిస్తుంది. సుమారు 90 కిలోమీటర్ల దూరం తెలంగాణలో ప్రవహించి, రెండు తెలుగు రాష్ట్రాల సరిహద్దుగా ఉంది. ఆలంపూర్ నుంచి మక్తల్ వరకు ఈ నది రెండు రాష్ట్రాలకు సరిహద్దు. ఆ తరువాత పూర్తిగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రవహించి సముద్రంలో కలుస్తుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్నప్పుడు మహారాష్ట్ర, కర్నాటక, ఆంధ్రప్రదేశ్ మధ్య నీటి పంపకాల వివాదాలు ఉండేవి. ఒకే రాష్ట్రంలో ఉన్నప్పటికీ, తెలంగాణ, ఏపీ మధ్య కూడా కృష్ణా నీటి విషయంలో పంచాయితీ ఉంది. కృష్ణానదిపై శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టులు తెలంగాణ, ఆంధ్రాలకు ఉమ్మడిగా ఉన్నాయి. ఈ ప్రాజెక్టులకు కుడివైపున ఏపీ ఉండగా, ఎడమవైపున తెలంగాణ ఉంది. వీటికి ఎగువన ఉన్న జూరాల ప్రాజెక్టు తెలంగాణ భూభాగంలో ఉండగా, దిగువన ఉన్న ప్రకాశం బ్యారేజీ ఏపీలో ఉంది. ఇవేకాక అనేక లిఫ్టులు ఉన్నాయి. రెండు రాష్ట్రాల అవసరాలను ఈ ప్రాజెక్టులు తీరుస్తున్నాయి.

తాజాగా కృష్ణాజలాల నీటివాటాల వివాదం మళ్లీ వేడెక్కింది. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ఏండ్ల తరబడి ఉన్న వివాదం.. తెలంగాణలో అధికార, ప్రతిపక్షాల మధ్య ప్రచ్ఛన్నయుద్ధానికి కారణమవుతున్నది. బీఆర్ఎస్ పాలకుల విధాన వైఫల్యం మూలంగానే కృష్ణాజలాలు ఏపీకి అధికంగా తరలి వెళ్లాయనీ కాంగ్రెస్, కాదు కాదు గురువు కోసం శిష్యుడు త్యాగం చేస్తున్నాడంటూ బీఆర్ఎస్ చంద్రబాబు, రేవంత్‌కు మధ్య లింక్ పెట్టే ప్రయత్నం చేస్తున్నది. గతంలో ఏపీ నీటి దోపిడీకి బీఆర్ఎస్ సహకరించిందని కాంగ్రెస్ విమర్శలు గుప్పిస్తుంటే, అలా కాదు ఇప్పుడు ఏపీ జలచౌర్యం చేస్తుంటే, తెలంగాణ నిద్రపోతున్నదని బీఆర్ఎస్ ఆరోపిస్తున్నది. ఇలా పాలకులు, ప్రతిపక్షాల అరోపణలు, విమర్శల పర్వం కొనసాగుతోంది.

రాష్ట్రాల మధ్య నీటి పంపకం కోసం కేంద్ర ప్రభుత్వం 1969 ఏప్రిల్‌లో ఒక ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేసింది. నదినీళ్లు రాష్ట్రాల మధ్య పంచడమే ఈ ట్రిబ్యునల్ పని. దీనికి ఆర్ఎస్ బచావత్ అధ్యక్షులుగా, డీఎం భండారి, డీఎం సేన్ సభ్యులుగా ఉన్నారు. కృష్ణా నీటి వివాద ట్రిబ్యునల్ పేరుతో పనిచేసిన ఈ బృందం 1976 మేలో తమ తీర్పును అందించింది. వాస్తవానికి 1973లోనే ఈ తీర్పు వచ్చినా, కేంద్రం మాత్రం 1976లో ప్రకటించింది. ఇప్పటికీ నది నీటిలో 75 శాతం నీటిని లెక్కేసి పంపిణీ చేశారు. కృష్ణానదిలో మొత్తం 2060 టీఎంసీల నీరు నికరంగా ఉంటుందని లెక్కించి, అప్పటి మూడు రాష్ట్రాలకు ఆ నీటిని పంచారు. అందులో 560 టీఎంసీలు మహారాష్ట్రకు, 700 టీఎంసీలు కర్నాటకకు, 800 టీఎంసీలు ఉమ్మడి ఏపీకి కేటాయించారు. ఈ నీళ్లను నదిలో ఎక్కడి నుంచైనా, ఏ ప్రాజెక్టు ద్వారానైనా




వాడుకోవచ్చని చెప్పారు. ఇక నదిలో మిగులు జలాలు 330 టీఎంసీలుగా అంచనా వేశారు. మిగులులో మహారాష్ట్రకు 25 శాతం, కర్నాటకకు 50 శాతం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 25 శాతం ఇస్తారు. ఇప్పుడు కృష్ణా ట్రిబ్యునల్ బ్రిజేష్‌కుమార్ ఆధ్వర్యంలో నడుస్తున్నది.

ఇదిలా వుండగా గత పదేండ్లుగా తెలంగాణ, ఏపీ నీటి వినియోగాన్ని పరిశీలిస్తే మాత్రం తెలంగాణకు అన్యాయం జరిగినట్టుగానే కనిపిస్తున్నది. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) లెక్కల ప్రకారం.. 2014-15 నుంచి 2024-25 వరకు ప్రతియేటా ఏపీ ఒప్పందం కంటే ఎక్కువగా నీటిని తరలించినట్టు స్పష్టమవుతున్నది. ఇటీవల బీఆర్ఎస్ అనుసరించిన విధానంపై తెలంగాణ సీఎం రేవంత్, నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తరచుగా విమర్శలకు దిగుతున్నారు. ఇటీవల ప్రధాని, కేంద్ర మంత్రులకు సైతం ఫిర్యాదు చేశారు. కృష్ణా నది తెలంగాణలో 70 శాతం పరివాహక ప్రాంతముందనీ, ఆ మేరకు 70 శాతం జలాలు తెలంగాణకు దక్కాలనే డిమాండ్‌ను ముందుకు తెచ్చారు. కాగా 2014లో ఏపీ విభజన తర్వాత రెండు రాష్ట్రాల మధ్య జల వివాదాల సమస్య మళ్లీ ముందుకొచ్చింది. బేసిన్ల లెక్కల ప్రకారం చూస్తే తెలంగాణ రాష్ట్రంలో కృష్ణా బేసిన్ 68 శాతం ఉండగా, నీటి వాటా 37 శాతం, ఏపీలో 32 శాతం ఉంటే, నీటి వాటా 64 శాతం వచ్చింది.

ఉమ్మడి రాష్ట్రానికి ముందు నుంచి ఉన్న 811 టీఎంసీల నీటిని రెండు రాష్ట్రాలు పంచుకున్నాయి. ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలు అనుకున్నారు. 2015లో ఇది తాత్కాలిక సర్దుబాటు ఒప్పందం మాత్రమే. దాన్నే ఏపీ హక్కుగా వాడుకుంటున్నది. కృష్ణా బేసిన్ వెలుపలి అవసరాలకు నీటిని తరలిస్తున్నారు. ఇకపై ఆ నిష్పత్తిని అంగీకరించేది లేదని ఏడాది క్రితం అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కారు ఘంటాపథంగా చెబుతున్నది. 50:50 వాటా కోసం కేంద్రానికి ఫిర్యాదు చేస్తే, కేఆర్ఎంబీలోనే తేల్చుకోవాలని చెప్పింది.


# రాజీనామా చేయించండి : కేటీఆర్

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: కాంగ్రెస్ పార్టీకి సిగ్గుంటే ఫిరాయించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలచే రాజీనామా చేయించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని ఉద్దేశిస్తూ ఎక్స్‌లో ఆయన ట్వీట్ చేశారు. ఫిరాయించిన వారు తాజాగా ప్రజల ఆదేశాన్ని కోరుకోవాల్సిందేనని తెలిపారు. లేకపోతే రాహుల్ గాంధీ ఫిరాయింపుల నిరోధానికి రాజ్యాంగాన్ని సవరించాలని చెప్పడం మానుకోవాలని డిమాండ్ చేశారు.



# సీతారామ ప్రాజెక్ట్ కాలువ పరవళ్లు

అన్నపురెడ్డిపల్లి :అమృత్ తెలంగాణ:సీతారామ ప్రాజెక్ట్ కాలువలో నీళ్ళు ఎప్పుడు పారతాయా అని ఎదురు చూసిన రైతుల కోరిక మంగళవారం నెరవేరింది. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రెండు రోజులు క్రితం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురంలో పంప్ హౌజ్ ప్రారంభించడంతో సీతారామ ప్రాజెక్ట్ కాలువలో నీళ్ళు ఏరులై పారుతున్నాయి. నూతన మండలం అయిన అన్నపురెడ్డిపల్లి మండలానికి మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో నీళ్లు రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నీళు ్ళ లేక పంటలు ఎండిపోతున్న సమయంలో ఒక్కసారిగా నీళ్ళు రావడంతో గ్రామాల్లో ప్రజలు సీతారామ కాలువను చూడటానికి వందల సంఖ్యలో చేరుకున్నారు. ఇది అంతా ఒక ఎత్తు



అయితే స్థానిక సంస్థల ఎన్నికలు పంచాయతీ ఎన్నికల దగ్గర పడటంతో రాజపురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సీతారామ ప్రాజెక్ట్ కాలువలో గోదావరి జలాలకు ఉదయం పసుపు, కుంకుమ చల్లి కొబ్బరికాయలు కొట్టారు. సాయంత్రం సమయంలో బీఆర్ఎస్ నాయకులు కేసీఅర్ చిత్రపటం కెనాల్‌లో పెట్టి పాలాభిషేకం చేసి గోదావరి జలాలు పల్లెలోకి తీసుకువచ్చి పంట పొలాలకు అందించిన ఘనత కేసీఆర్‌కి దక్కుతుందంటూ పార్టీల ప్రతాపాన్ని చూపించారు.

# చరిత్రకు సజీవ సాక్ష్యం తెలంగాణ ఉద్యమకారుల చరిత్ర పుస్తకం..

## మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ ముధోల్ నియోజకవర్గం ఇన్చార్జ్ నారాయణ రావు పటేల్,.





తెలంగాణ ఉద్యమకారుల చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించి ఉద్యమకారులను సన్మానించిన మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్,

నిర్మల్ జిల్లా బైంసా మార్చి 4 అమృత్ తెలంగాణ బైంసా లొ మాజీ ఎమ్మెల్యే నివాసంలో మంగళవారం తెలంగాణ ఉద్యమకారులు ముధోల్ నియోజకవర్గం పుస్తకం చరిత్రకు సజీవ సాక్ష్యంగా నిలుస్తుందని మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావు పటేల్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పాటుపడిన ముధోల్ నియోజకవర్గం ఉద్యమకారుల చరిత్రను పుస్తక రూపములో తీసుకొనిరావడ అభినందనీయమని ఆయన అన్నారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో పుస్తక సంపాదకులు జాధవ్ పుండలిక్ రావు పాటిల్ , తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నిర్మల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ముప్పం రామకృష్ణ గౌడ్ ను అభినందించి సన్మానించారు.

# కనకాపూర్ లో బీఆర్ఎస్ క్యాలెండర్, డైరి ఆవిష్కరణ....

## బీఆర్ ఎస్ యువ నాయకులు ఇర్ల గణేష్



బిఆర్ఎస్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న యువ నాయకుడు ఈర్ల గణేష్, కార్యకర్తలు

నిర్మల్ జిల్లా లోకేశ్వరం: మార్చ్ 4 అమృత్ తెలంగాణ లోకేశ్వరం మండలంలోని కనకాపూర్, గ్రామంలో మంగళవారం బీఆర్ఎస్ ముధోల్ నియోజక వర్గ అధ్యక్షులు కిరణ్ కొమ్రే వార్, లోలం శ్యాంసుందర్. ఆదేశాల మేరకు ఇర్ల గణేష్, ఓంకార్ దేవేందర్, తెలంగాణ రాష్ట్ర సమితి క్యాలెండర్ మరియు డైరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బి ఆర్ఎస్ యువ నాయకులు ఇర్ల గణేష్ మాట్లాడుతూ..ముధోల్ నియోజక వర్గం లో ఉన్న ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ పార్టీ ఎన్నికలో ఇచ్చిన ఏ ఒక్కటి కూడా అమలు చేయకుండా ప్రజలకు మోసం చేస్తుందని అన్నారు.దింతో రైతులకు రైతు బందు విడుదల చేస్తామని చెప్పిన ఇప్పటి వరకు కనీసం రెండు ఎకరాలకు కూడా రైతు బందు డబ్బులు జమ చేయలేదని విమర్శించారు. కేసిఆర్ ప్రభుత్వంలో రైతులకు సరైన సమయంలో రైతు బందును విడుదల చేసి రైతులకు పెట్టుబడి సహాయం అందించిన ప్రభుత్వం అంటే బిఆర్ ఎస్ ప్రభుత్వమే అని అన్నారు.

ఇప్పటికైనా ప్రజలు అర్థం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సాలయి పోతున్న, ఇర్ల దేవేందర్, గాలాయి భూమన్న, తోట బాబు, చెంచుల భీమన్న, బందెల శ్రీకాంత్, బిఆర్ ఎస్ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# అదిలాబాద్ పట్టణంలో విజయోత్సవ సంబరాలు



విజయం సాధించిన మల్కా కుమారయ్య కరీంనగర్ లో శుభాకాంక్షలు తెలుపుతున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్





ఎమ్మెల్సీ గెలవడంతో అదిలాబాద్ పట్టణంలో స్వీట్లు తినిపిస్తున్న బిజెపి పార్టీ పట్టణ అధ్యక్షులు వేద వ్యాస్



మీడియాతో మాట్లాడుతున్న బిజెపి పట్టణ అధ్యక్షులు వేదవ్యాస్

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ అధికార మదంతో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఎన్నికలకు వెళ్తే ఈ రాష్ట్ర ప్రభుత్వం ఓడిపోతుందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎలక్షన్స్ ద్వారా నిరూపించబడ్డది. అదిలాబాద్ పట్టణ అధ్యక్షులు వేదవ్యాస్ మాట్లాడుతూ ఒక ఉపాధ్యాయుడు 100 ఓటర్లతోటి సమానం అని తెలిపాడు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సుమారు 15 నెలలు గడుస్తున్న ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు కాలేవని ఇప్పుడున్న పరిస్థితులు రాష్ట్ర ప్రభుత్వం యొక్క అభ్యర్థిని గెలిపించుకుంటే సమస్యలు తీరవని ఉపాధ్యాయులకు భావించి ప్రత్యర్థి బిజెపి పార్టీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి శ్మల్క కొమరయ్య ఉపాధ్యాయ బృందం గెలిపించుకోవడం జరిగింది. జాతీయ పార్టీ ,రాష్ట్ర పార్టీ మరియు ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ సూచన మేరకు ఒక మంచి ప్రణాళిక బద్దంగా ప్రచారం జరపడం జరిగింది. ఈ గెలుపు కారణమైన ఉపాధ్యాయ బృందాలు, TPUS బృందానికి మరియు బిజెపి నాయకులకు కార్యకర్తలకు పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. ఈనాటి విజయోత్సవ కార్యక్రమంలో గంద్రత్ మహేందర్ ,జోగు రవి, దినేష్ మాటోలియా, దయాకర్, రాకేష్, భీమ్సేన్ రెడ్డి, జ్యోతి రెడ్డి, కొర్రి భూమేష్ ఇతర బిజెపి నాయకులు పాల్గొనడం జరిగింది.

# తెలంగాణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుల సంఘం - 2025 నూతన డైరీ ఆవిష్కరణ



డిగ్రీ కళాశాల అధ్యాపకుల సంఘం నూతన డైరీ ఆవిష్కరించిన ప్రిన్సిపల్ కర్రోళ్ల బుచ్చయ్య,

నిర్మల్ జిల్లా, భైంసా మార్చు 4 అమృత్ తెలంగాణ బైంసా పట్టణంలోని గోపాల్ రావ్ పాటిల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం తెలంగాణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుల సంఘం 2025 నూతన డైరీను కళాశాల ప్రిన్సిపాల్ కర్రోల బుచ్చయ్య, ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు డాక్టర్ భీమ్ రావ్ ఝూడే, కార్యదర్శి డాక్టర్ పవన్ కుమార్, డాక్టర్ పీజీ రెడ్డి మరియు కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కర్రోల బుచ్చయ్య, మాట్లాడుతూ, అధ్యాపకుల సమగ్ర అభివృద్ధి కోసం ఈ డైరీ ఎంతగానో ఉపయోగపడుతుందని, విద్యా రంగంలో ఇంకా మెరుగైన సేవలను అందించడానికి ఇది దోహదం చేస్తుందని అభిప్రాయపడ్డారు. అధ్యాపకుల సంఘం ఈ నూతన డైరీ ద్వారా తమ కార్యాచరణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు సహకరించనుందని సంఘ అధ్యక్షులు డాక్టర్ భీమ్ రావ్ ఝూడే, తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించిన కళాశాల అధ్యాపక బృందానికి, సంఘ సభ్యులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

# అంతర్జాతీయ మానవ హక్కుల సమాఖ్య, (ఐ హెచ్ ఆర్ సి) జిల్లా అధ్యక్షులు గా కుంటొల్ల వెంకటస్వామి నియామకం....



ఐ హెచ్ఆర్సి జిల్లా అధ్యక్షులుగా వెంకటస్వామి నియామకం

నిర్మల్ జిల్లా మార్చ్ 4 అమృత్ తెలంగాణ నిర్మల్ జిల్లా కేంద్రంలో మంగళవారం రోజు ఉదయం 11 గంటలకు జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోల సంఘ భవనంలో అంతర్జాతీయ మానవ హక్కుల సమాఖ్య ( ఐ హెచ్ ఆర్ సి ) జిల్లా సమావేశము జరిగింది ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా అంతర్జాతీయ మానవ హక్కుల సమాఖ్య అంతర్జాతీయ అధ్యక్షులు ప్రొఫెసర్ డాక్టర్ వి ఎల్ రాజు, గౌరవ అతిథిగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పసుల రాజలింగం, విశిష్ట అతిథి గా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మసూరే అర్చన లు హాజరైనారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ అధ్యక్షులు ప్రొఫెసర్ డాక్టర్ వి ఎల్ రాజు మాట్లాడుతూ సమాజంలో కులాలు, మతాల కు అతీతంగా మానవులందరూ సమానంగా జీవించాలని అన్నారు. బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వ్రాసినటువంటి భారత రాజ్యాంగాన్ని కాపాడాలని కోరారు. మానవులందరూ ఆత్మగౌరవంతో బతకాలని తెలిపారు మూఢనమ్మకాలను మూఢవిశ్వాసాలను తొలగించాలని అన్నారు. ఈ సమావేశంలో అంతర్జాతీయ మానవ హక్కుల సమాఖ్య జిల్లా అధ్యక్షులు గా కుంటోల్ల వెంకటస్వామి ని నియమించారు, మరియు వి సాయి వంశీ ని రాష్ట్ర జనరల్ సెక్రటరీ గా, మరియు పట్టణ అధ్యక్షులు గా పాతర్ల ధర్మరాజు ను నియమించారు, ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కుంటొల్ల వెంకటస్వామి మాట్లాడుతూ నాపై ఎంతో నమ్మకంతో నన్ను జిల్లా అధ్యక్షులు గా నియమించినందుకు ధన్యవాదాలు ప్రత్యేక జై భీమ్ లు తెలిపారు ఈరోజు నుండి 3 సంవత్సరాల పాటు ఈ పదవిలో కొనసాగుతూ దళితుల హక్కుల కోసం అనేకమైన వారి సమస్యల కోసం నిరంతరం పాటుపడతామని తెలియజేశారు అలాగే జిల్లావ్యాప్తంగా అంతర్జాతీయ మానవ హక్కుల సమాఖ్య ను స్థానికంగా బలోపేతం చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్ల రమేష్, ఈరోల పురుషోత్తం, బొబ్బిలి మంజుల, నలియాల కాశవ్వ, బత్తుల నరేష్, గంగాధర్ లు కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టల్ ఆవిష్కరించిన జిల్లా పాలనాధికారి అభిలాష అభినవ్

అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ తెలంగాణ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం సాయంత్రం కలెక్టరేట్లోని తన చాంబర్లో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హైదరాబాదులో నిర్వహిస్తున్న మహిళా దినోత్సవ వేడుకలకు జిల్లా నుంచి మహిళా అధికారులు ఉద్యోగులు పాల్గొనాలని కోరారు. టీ జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పి జి రెడ్డి మాట్లాడుతూ టీజీవో కేంద్ర సంఘం మహిళా విభాగం ఆధ్వర్యంలో ఈనెల 6 తేదీ నుండి 8వ తేదీ వరకు హైదరాబాదులోని ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయ కళాశాల, దోమలగూడ లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకలకు రాష్ట్ర మహిళా మంత్రులు కొండా సురేఖ, సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి లు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని తెలిపారు. జిల్లా నుండి అధిక సంఖ్యలో మహిళా ఉద్యోగులు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా కార్యదర్శి ధాత్రిక రమేష్, అసోసియేట్ ప్రెసిడెంట్ ప్రవీణ్ కుమార్, జిల్లా మహిళా విభాగ బాధ్యులు గోదావరి, డాక్టరు రాణి, కరుణశ్రీ, దేవొల్ల లత, ఉపాధ్యక్షులు శంకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రవి కుమార్, పబ్లిసిటీ సెక్రటరీ విష్ణు వర్ధన్ , ఆఫీసు సెక్రెటరీ క్రాంతి కుమార్, కార్యవర్గ సభ్యులు, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నర్సాపూర్ మండల కేంద్రంలో బిజెపి సంబరాలు...



సంబరాలు జరుపుకుంత బిజెపి నాయకులు

నిర్మల్ జిల్లా నర్సాపూర్ జి మార్చి 4 అమృత్ తెలంగాణ నిన్న జరిగిన ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్థానిక ఎమ్మెల్యే మహేశ్ అన్న నాయకత్వం లో బిజెపి అభ్యర్థి మల్క కొమురయ్య, ను అత్యధిక మెజారిటీ తో తమ మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించిన ఉపాధ్యాయులందరికి అభినందనలు ఉపాధ్యాయుల సమస్యల కోసం ఎల్లప్పుడు బిజెపి మద్దత్తుగా పోరాడుతుందని, గతంలో వారి సమస్యల కొరకు బండి సంజయ్, జైలుకు వెళ్లడం జరిగింది అని నర్సాపూర్ మండల అధ్యక్షులు బర్కుంట నరేందర్, అన్నారు.ఈ కార్యక్రమం లో నాయకులు మిట్టపల్లి రాజేందర్, సవీన్, దత్తురాం, లక్ష్మణ్, సుధాకర్, రాము, పల్లపు రాజు, సుదర్శన్ రెడ్డి, గంగాధర్, రవీందర్, రాకేష్ లు పాల్గొన్నారు...

# శత శాతం ఫలితాలకు కృషి చేయాలి

ఆసిఫాబాద్ :అమృత్ తెలంగాణ: రానున్న పదవ తరగతి పరీక్షల్లో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చదువుతున్న విద్యార్థుల శతశాతం ఫలితాల కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలని గిరిజన శాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి అన్నారు. జిల్లా కేంద్రాల్లోని బాలికల ఆశ్రమ పాఠశాలలో పదో తరగతికి బోధించే ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదో తరగతి ఉత్తమ ఫలితాల సాధనకు సబ్జెక్టు ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాల కోసం గత నవంబర్ నుండి నిర్వహించిన 100 రోజుల ప్రణాళికను ఉపయోగించుకోవాలన్నారు. రోజువారీగా విద్యార్థులకు పరీక్షలు నిర్వహించడంతోపాటు, వారిని ఎప్పటికప్పుడు సిద్ధం చేయాలన్నారు. వెనుకబడిన విద్యార్థుల గుర్తించి శ్రద్ధ తీసుకోవాలని కోరారు. జిల్లాలోని 36 ఆశ్రమ పాఠశాలలో 1255 మంది విద్యార్థులు మార్చి 21 నుండి జరిగేపదవ తరగతి పరీక్షలు హాజరుకానునట్లు తెలిపారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఆరోగ్యంగా మానసిక ధ్రుడత్వం కోసం ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సోమ, మంగళ వారాల్లో జరిగిన వృతంత శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలుపరిచి ఉత్తమ ఫలితాలను సాధించాలని ఉపాధ్యాయులని కోరారు. ఈ సమావేశంలో ఏసిఎంఓ ఉద్ధవ్, కోర్స్ డైరెక్టర్లు నైతం కృష్ణారావు, కె రవీందర్, డిఎస్ఓ మీనారెడ్డి, ఎటీడిఓ చిరంజీవి, రిసోర్స్ పర్సన్ లు సంతోష్, సాగర్, బాలాజీ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

# బాలశక్తి కార్యక్రమాన్ని పకడ్బందీగా కొనసాగించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.

అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ : మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బాలశక్తి కార్యక్రమం నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్య, ఆర్థిక, సామాజిక సామర్థ్యాలు, నైపుణ్యాలు పెంపొందించేందుకు ప్రత్యేకంగా అమలుపరుస్తున్న బాలశక్తి కార్యక్రమాన్ని మెరుగ్గా అమలుపరచాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులందరికీ వైద్య పరీక్షల నిర్వహణ కార్యక్రమం నిరంతరం కొనసాగించాలని వైద్యాశాఖ అధికారులను ఆదేశించారు. వైద్య పరీక్షలు నిర్వహించిన విద్యార్థులందరికీ హెల్త్ కార్డులను అందించాలని, అనారోగ్య సమస్యలను గుర్తించినట్లయితే వారికి ప్రత్యేక పోషక ఆహారం, మందులను అందించాలన్నారు. విద్యార్థుల పోషకులతో సమావేశాలు నిర్వహించి విద్యార్థుల ఆరోగ్య స్థితిగతుల వివరాలను తెలియజేయాలన్నారు. ఇప్పటికే పలువురు విద్యార్థులలో అనారోగ్య సమస్యలను గుర్తించి వారి అనారోగ్య సమస్యలను అధిగమించడానికి తగు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ప్రత్యేక చర్యల ద్వారా ఇప్పటికే పలువురు విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులు మెరుగుపడ్డాయి, దృష్టిలోపం ఉన్న విద్యార్థులకు పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. సీజినల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. పరీక్షల పట్ల భయాన్ని తొలగించేలా, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించేలా మానసిక వైద్య నిపుణులతో ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలన్నారు. ఆర్థిక అక్షరాస్యత పెంపొందించేలా క్షేత్రస్థాయిలో బ్యాంకులకు తీసుకువెళ్లి బ్యాంకు లావాదేవీలు, వివిధ రకాల రుణాలు, బ్యాంకింగ్ ఫారములు, సైబర్ అక్షరాస్యత పెంపొందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే పలు పాఠశాలల విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటనలు పూర్తయ్యాయని తెలిపారు. విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటనలకు వీలుగా వాహనాన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.



అన్ని పాఠశాలల్లో నమూనా పార్లమెంట్ నిర్వహించి విద్యార్థులకు రాజ్యాంగం, ప్రజాస్వామ్యం పట్ల అవగాహన కల్పించాలన్నారు. ఏప్రిల్ నెలలో విద్యార్థులందరికీ వివిధ అంశాలపై పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. బాలశక్తి కార్యక్రమం పకడ్బందీగా నిర్వహిస్తూ విద్యార్థుల్లో వివిధ అంశాల పట్ల అవగాహన కల్పిస్తూ, ఆరోగ్య స్థితిగతులను మెరుగుపరిచినందుకు సంబంధిత అధికారులను సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నీటి కొరత ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బోరు బావుల్లో సమస్యలు తలెత్తితే వెంటనే మరమ్మత్తులు చేయించి నీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. ప్రతి పాఠశాలలో ఫిర్యాదులు, సూచనల పెట్టెలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డిఈఓ పి. రామారావు, డిఎంహెచ్ఓ రాజేందర్, గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోదాంను పరిశీలించిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.






ఈవీఎం గోదం ను పరిశీలిస్తున్న జిల్లా పాలనాధికారి అభిలాష్ అభినవ్

అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ కలెక్టరేట్ కార్యాలయం సమీపంలోని ఈవీఎం గోదాంను మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈవీఎం గోదాం వద్ద భద్రత సిబ్బంది నిరంతరం గస్తీ నిర్వహించాలని సూచించారు. షిఫ్టుల వారీగా భద్రతను పర్యవేక్షించాలని, సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, ఇతర సామాగ్రికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా గోడౌన్ లో పూర్తి స్థాయిలో భద్రత కల్పించాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్, భద్రతా సిబ్బంది, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అంటూ అడుగులు వేస్తున్న ఎస్పి జానకి షర్మిల ఐపిఎస్..జిల్లా పోలీసులు....

అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ పోలీస్. జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించి ఈ సైబర్ జాగృతదినం రోజు మహిళలకు జాబ్ ఫ్రాడ్, డిజిటల్ అరెస్ట్, సైబర్ స్లేవరీ, సైబర్ స్టాకింగ్ మోసాల పట్ల అవగాహన కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎస్పి కార్యాలయం లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.... సైబర్ మోసగాళ్ళ వర్క్ ఫ్రం హెూం అని, ఆకట్టుకునే వేతనాలు అని, పార్ట్ టైం జాబులు అనే వివిధ ఆఫర్ల తో మహిళలను, గృహిణులను ఆకర్శిస్తారు. మహిళలకు మాయ మాటలు చెప్పి వారి నమ్మకాన్ని సంపాదిస్తారు ఇంట్లో పనులు అయిన తర్వాత ఖాళీ సమయాలలో ఉద్యోగం చేసుకోవచ్చని రోజుకు ఇంత నెలకు ఇంత చొప్పున సంపాదించ వచ్చని ఆశ చూపించి మీ వ్యక్తిగత వివరాలు బ్యాంకు ఎకౌంటు వివరాలు, పాన్ కార్డు మరియు అదార్ కార్డు వివరాలను సేకరించి మోసం చేస్తారు. ఉద్యోగం పేరుతో వివిధ app లను డౌన్లోడ్ చేయించి మీ ఫోన్ లను హ్యాక్ చేసి మహిళలను వారి వ్యక్తి గత రహస్యాలను సేకరించి వాటిని చూపించి భయపెట్టి, ఒత్తిడి చేసి వారితో సైబర్ మోసాలు చేయిస్తారు మరియు వారి బ్యాంకు ఎకౌంటు లకు మోసపూరిత డబ్బులు పంపి తర్వాత వారికి కావాల్సిన ఎకౌంటుల లోకి వాటిని మళ్ళించి మీకు తెలియకుండానే సైబర్ కేసులలో ఇరికిస్తారు. కావున మీరు ఎట్టి పరిస్తితులలో మీ వివరాలను ఎవరికీ పడితే వారికి పంపవద్దని జిల్లా ఎస్పీ కోరారు... మీ సోషల్ మీడియా అకౌంట్స్ whatsapp, Instagram, google అకౌంట్ ల వివరాలను ఎవరికీ ఇవ్వవద్దని వారు పంపిన apps ను ఫోన్ లో డౌన్లోడ్ చేసుకోవద్దన్నారు.. విదేశాలలో ఉద్యోగాలంటూ భారీ జీతాలు అంటూ సోషల్ మీడియాలో వచ్చే వివిధ ప్రకటనలను మహిళలు నమ్మవద్దని . ఉద్యోగం పేరుతో విదేశాలలో సైబర్ నేరాలు చేయించి వారు భారీ మొత్తం మీ ద్వార సంపాదించి మీకు మాత్రం నామమాత్రంగా జీతాలు ఇస్తారన్నారు . మీ పాస్ పోర్ట్ లను మీ వద్ద నుండి లాక్కొని మిమ్ములను భయ భ్రాంతులకు గురిచేసి మీ చేత వెట్టిచాకిరి చేయిస్తారని, విదేశాలలో ఉద్యోగాల పేరుతో బ్రోకర్ లు మీకు ఉద్యోగ వీసా అని చెప్పి విసిటింగ్ వీసా/ టూరిస్ట్ వీసా ఇప్పించి విదేశాలకు పంపి మీ దగ్గర భారీ మొత్తం లో డబ్బులు గుంజుతారని తెలిపారు.. విదేశాలకు వెళ్ళిన కొద్ది రోజులకే మీ వీసా గడువు ముగిసి పోయి మీపైన అక్కడ కేసులు అయ్యే ప్రమాదం ఉంటుందన్నారు కాల్ సెంటర్ ఉద్యోగమని చెప్పి మీకు తెలిసిన భాష తో ఇండియా లోని ప్రజలతో మాట్లాడించి వారిని మనవారే అనేలా నమ్మించి ట్రాప్ చేయించి మీ ద్వారా సైబర్ నేరాలను చేయించి వచ్చిన డబ్బులను క్రిప్టో కరెన్సీలోకి మార్చుకొని మన దేశ సంపదను కొల్లగోడుతారని . సైబర్ స్లేవరీ జరిగిన వెంటనే మీరు ఆ దేశంలోని భారత రాయభార కార్యాలయనికి సమాచారం ఇవ్వాలన్నారు సైబర్ స్టాకింగ్ అనగా సోషల్ మీడియా ప్లాట్ ఫాం నందు మీ ఎకౌంటు ఎవరైనా హ్యాక్ చేసి మీ పేరు మీద మీ స్నేహితులకు గాని మీ బంధువులకు గాని మీ మాదిరి గానే మీరు పంపినట్లు అనిపించే అసహ్యాకరమైన, అసభ్య కర మైన పోస్ట్ లను మహిళలకు పంపుతారు అదే మాదిరి మీపేరు పైన whatsapp గ్రూప్ లలో ఇతరుల మనోభావాలను దెబ్బ తీసే విధంగా గాని, మత ఘర్షణ జరిగే విధమైన పోస్ట్ లు పెట్టి మిమ్ములను ఇరికించే ప్రమాదం ఉందని అదే మాదిరి మీ పేరు మీద మీ మాదిరి గానే అత్యవసరం అని చెప్పి డబ్బులు కావాలి అని అడిగి డబ్బులు గుంజే



ప్రమదం ఉందన్నారు . కావున మహిళలు ఎప్పటి కప్పుడు మీ అకౌంట్ లను గమనిస్తుండాలి మరియు మీ ఎకౌంటు లకు strong password లను పెట్టుకోవాలి వాటిని సవరించు కోవాలని సూచించారుసోషల్ మీడియా ప్లాట్ ఫాం లందు మీ వ్యక్తిగత వివరాలు, ఫోటోలు, వీడియోలు అప్లోడ్ చేయవద్దని, మీ వ్యక్తిగత వివరాలలో గోప్యత పాటించాలని సోషల్ మీడియా ప్లాట్ ఫాం లలో మీ అకౌంట్స్ అన్నింటికీ two way authentication మరియు pass key లను అక్టివేట్ చేసుకోవాలన్నారు.. అప్పుడు మీ ఎకౌంటు హ్యాక్ చేస్తే మీ ఫోన్ కు సమాచారం వస్తుందని సూచించారు... డిజిటల్ అరెస్ట్ అనగా పోలీస్ లేదా ప్రభుత్వ అధికారి వేషం ధరించి వీడియో కాల్స్ చేసి మీ పేరు క్రిమినల్ కేసులలో ఉన్నది అని చెప్పుతారు కొన్ని సార్లు మీ కొడుకు లేదా మీ కూతురు బయట దేశాలలో ఉంటే వారు రేప్ లేదా డ్రగ్ కేసు లలో చిక్కు కున్నారని భయ పెడతారు. ముఖ్యంగా గృహిణులను టార్గెట్ చేసి మేము చెప్పినట్లు చేయక పోతే మీరు అరెస్ట్ అవుతారు మీ బ్యాంకు ఎకౌంట్ లు ఫ్రీజ్ అవుతాయి అని భయపెడతారు. నిజమైన పోలీసులుగా నటించి మహిళలను వృద్దులను బ్లాకు మెయిల్ చేసి డబ్బులు గుంజుతారని,అరెస్ట్ అవుతారని చెప్పినప్పుడు భయపడకుండా మీ స్నేహితులతో గాని మీ బంధువులతో గాని నిర్భయంగా తెలపాలని, పోలీసుల సహకారం పొందాలని నిజమైన పోలీసులు ఎప్పుడు డబ్బులు వేయమని ఫోన్ కాల్స్ గాని వీడియో కాల్స్ గాని చేయరని, అనుమానం అనిపించిన వెంటనే సంభందిత పోలీస్ స్టేషన్ వెళ్లి జరిగిన విషయాలను చెప్పాలన్నారు... ముఖ్యం గా సోషల్ మీడియా సైబర్ క్రైమ్ పై ప్రతి మహిళ అవగాహన కలిగి ఉండాలన్నారు...SP Job Fraud, Digital Arrest, Cyber Slavery, Cyber Stalking మోసాలకు గురికాకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఎవరైనా సైబర్ మోసం భారిన పడినట్లయితే వెంటనే 1930 సైబర్ హెల్ప్ లైన్ నెంబర్ కు గాని లేదా www.cybercrime.gov.in కు గాని సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమం నందు సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ L.V. రమణ రావు మరియు RSI రవి కుమార్ మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు...

# జన్నారంలో నవోదయ పాఠశాల ఏర్పాటు చేయాలి..

జన్నారం :అమృత్ తెలంగాణ: జన్నారం మండలంలో నవోదయ పాఠశాల ఏర్పాటు చేయాలని అదిలాబాద్ ఎంపీ గోడెం నగేశ్కు నవోదయ పాఠశాల సాధన కమిటీ సభ్యులు వినతి పత్రం అందజేశారు. మండల అభివృద్ధి కమిటీ కార్యవర్గం ఆధ్వర్యంలో మంగళవారం వారు ఆదిలాబాద్కు వెళ్లి ఎంపీ గడం నగేష్ ని మర్యాదపూర్వకంగా కలిసి మండలంలో నవోదయ పాఠశాల ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని ముప్పై పడకల ఆస్పత్రిగా అప్గ్రేడ్ చేయాలని కోరారు. అలాగే మండల కేంద్రంలో రోడ్డు డివైడర్లు ఏర్పాటు చేసి సెంట్రల్ రైటింగ్ సిస్టంను ఏర్పాటు చేయాలని కోరారు. కోడూరి చంద్రయ్య, ఆడెపు లక్ష్మీనారాయణ, శ్రీరాముల కొండయ్య కన్వీనర్లు లక్ష్మీనారాయణ, ఐలవేణి రవి ఎంబడి సత్తన్న బైరి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



# ఒత్తిడి వద్దే వద్దు - 'పది'ని జయించు



అమృత్ తెలంగాణ బ్యూరో సీనియర్ రిపోర్టర్ కేఎల్ రాములు,

అమృత్ తెలంగాణ : నూతన సిబిఎస్‌సి సిలబస్‌తో పదో తరగతి పరీక్షలు మొదటి సారిగా మన రాష్ట్రంలో ఈనెల 17 నుంచి ప్రారంభంకానున్నాయి. పరీక్షల సమయంలో సాధారణంగా విద్యార్థులు ఒత్తిడికి గురౌతుంటారు. ఇది ఏమాత్రం సరికాదు. ప్రశాంతంగా ఉండాలి. ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ఉండాలి. తద్వారానే పరీక్షల్లో మంచిగా పరీక్షలు రాసి తద్వారా మంచి మార్కులు సాధించే అవకాశం ఉంటుంది. ఏడాదిపాటు చదివిన అంశాలే కాబట్టి అన్ని ప్రతిరోజూ అన్ని సబ్జెక్టులకు సంబంధించిన పాఠాలను చదువుకుంటూ వెళ్లటం ఉత్తమం. తద్వారా గతంలో చదివిన విషయాలను మళ్లీ ఒకసారి గమనంలోకి తెచుకోవటానికి అవకాశం ఉంటుంది. అందువల్ల పిల్లలూ ఎవ్వరూ ఒత్తిడికి గురికావద్దు. ప్రణాళికాబద్ధంగా కషిచేస్తే మంచి మార్కులతో విజయం సాధించటం సులభమే అవుతుంది. ఏడాదిలో కష్టపడి చదివింది ఎలాంటి తప్పిదాలకు తావీయకుండా 3.15 గంటల సమయంలో (పిఎస్, ఎన్ఎస్ పరీక్షలు 2 గంటలు మాత్రమే) పరీక్షల్లో సమర్థవంతంగా రాయగలిగినప్పుడే చక్కని ఫలితం చేజిక్కుతుంది. చిన్న తప్పిదాల కారణంగా ప్రతిభావంతులు సైతం ట్రిపుల్ఐటీల్లో ప్రవేశం కోల్పోతుంటారు.

జవాబులు ఇలా రాయాలి

ప్రశ్నాపత్రంలోని ప్రశ్నలు విద్యార్థుల పరిశీలన, విశ్లేషణ, అవగాహన శక్తిని వెలికితీసేలా ఉంటాయి. అందుకే ప్రశ్నాపత్రాన్ని చదవడానికే పావుగంట సమయం ఇచ్చారు. సుమారు 75శాతం మంది ప్రశ్నాపత్రాన్ని తీసుకున్న 5 నిమిషాల్లోనే జవాబులు రాయటం మొదలెడుతున్నారు. ఇది సరికాదు. ముందుగా ప్రశ్నలను బాగా చదవాకే సమాధానాలు రాయటం ప్రారంభించాలి. సమాధాన పత్రాలతో కూడిన బుక్‌లెట్ ఇవ్వగానే ముందుగా ప్రతి పేజీకి ఎడమవైపు 2-2.5సెంటీమీటర్లు ఉండేలా మార్జిన్ వదలాలి. తెలుగులో మూడు భాగాలుంటాయి. మొదటి భాగంలో 32 మార్కులు సులభంగా సాధించొచ్చు. వీటిలో పరిచిత పద్యాలు 21 ఉన్నాయి. వీటిలో 8 సాధన చేస్తే మంచి మార్కులు సాధించొచ్చు. పద్య భాగంలో కవి పరిచయం, గద్యంలో ప్రక్రియలు, లేఖ, కరపత్రం అంశాలు, ఛందస్సులో వృత్తపద్యాలపై ప్రశ్నలొస్తాయి. మారీచుడు, కైక, విశ్వామిత్రుడు, సుగ్రీవుడు, దశరథుడు వంటి అంశాలతోపాటు రామాయణం ప్రాశస్త్యం, తదితర అంశాలపై పట్టుసాధిస్తే మంచి మార్కులు సాధించొచ్చు. హిందీ సబ్జెక్ట్‌లో తొలుత ప్రశ్నావళిని అవగాహన చేసుకొని ప్రశ్నలకు సమాధానాలు రాయాలి. సెక్షన్-1లో 12 ప్రశ్నలు వ్యాకరణానికి సంబంధించినవి ఉంటాయి. పేరాగ్రాఫ్ పాసేజ్ చక్కగా చదివి జవాబులు రాయాలి. 13,14,15,16 ప్రశ్నల్లో కీలక పదాన్ని గుర్తించి సమాధానాన్ని తేలికగా వెదికి జవాబు రాయాలి. 17 ప్రశ్న కబీర్, మైథిలి, శరణగుప్తలో కవి పరిచయం వస్తుంది. 19వ ప్రశ్న సాఖీ పాఠంలోని 4 దోహాలలో ఒకటి తప్పనిసరిగా వస్తుంది. వీటిని జాగ్రత్త చదవడం ద్వారా మంచి మార్కులు పొందొచ్చు. ఇంగ్లీషు ప్రశ్నాపత్రంలో మొత్తం మూడుసెక్షన్లు ఉంటాయి. ప్రశ్నా పత్రంలోని ప్రశ్నలు క్షుణ్ణంగా చదివి జవాబులు రాయాలి. కాంప్రహెన్షన్ ప్యాసేజ్‌లో ప్రశ్నలకు ఇచ్చిన టెక్స్టులోనే సమాధానాలు ఉంటాయి. దీంతో సులభంగానే 30 మార్కులు సాధించొచ్చు. సెక్షన్ బిలో గ్రామర్ అండ్ ఒకాబులరీలో యాక్టివ్ వాయిస్, ప్యాసివ్ వాయిస్, ప్రిపోజిషన్స్, డిక్షనరీ ఎంట్రీ, స్పెల్లింగ్ టెస్ట్, సిఫిక్స్-ప్రిఫిక్స్ వంటివి తేలికగా జవాబులు రాయొచ్చు. సెక్షన్ సిలో క్రియేటివ్ ఎక్స్‌ప్రెషన్ సొంతంగా రాయడం ద్వారా మంచి మార్కులు సాధించొచ్చు. సమాధానాలన్నీ ఒకేచోట క్రోనాజికల్ ఆర్డర్‌లో రాయాలి. గణితశాస్త్రంలో మార్కుల సాధన సులభం. సంభావ్యత బహుపదులు, వాస్తవ సంఖ్యలు, నిరూపక రేఖాగణితం అధ్యాయాలపై ప్రత్యేక ప్రాక్టీసు చేయాలి. నిరూపక జామితి పాఠ్యాంశం నుంచి సెక్షన్ నాలుగు లేదా ఎనిమిది మార్కులకు, సాంఖ్యకశాస్త్రంలోని మీన్, మోడ్, మీడియన్‌లపై తప్పనిసరిగా ప్రశ్న ఉంటుంది. గ్రాఫ్‌పై సాధన చేస్తే మంచి మార్కులు సాధించొచ్చు. భౌతిక రసాయన శాస్త్రంలో 50/50 మార్కులు సాధించొచ్చు. ఎస్సీఆర్టీ వారు అందించిన స్టడీమెటీరియల్‌ను సాధన చేయడం ద్వారా మంచి మార్కులు పొందొచ్చు. లోహాలు, అలోహాలు పాఠం నుంచి ప్రయోగం నేర్చుకుంటే సులభంగా ఎనిమిది మార్కులు పొందొచ్చు. మయోపియా, హైపర్ మెట్రోపియా దృష్టి లోపాలు, వాటిని సవరించే విధానం నేర్చుకోవాలి. ఇంద్రధనుస్సు ఏర్పడే విధానం కాంతి పరిక్షేపణ వంటి ప్రశ్నలు ప్రశ్నలు బాగా సాధన చేస్తే మంచి మార్కులు వస్తాయి. బొమ్మలు గీసేటపుడు స్పష్టతతో ఉంటే మంచి ఫలితాలు సొంతం చేసుకోవచ్చు. భౌతికశాస్త్రంలోని సమస్యల (ప్రాబ్లెమ్స్)లో ప్రమాణాలను రాయడం మరిచిపోరాదు. ఉధాహరణకు సెంటీ మీటరు, గ్రాము, జౌలు, వాట్స్ తదితరాలు. జీవశాస్త్రంలో ప్రయోగాలకు చెందిన జవాబులను రాసేటప్పుడు సంబంధిత బమ్మలను కూడా తప్పక వేయాలి.గణితంలో ముఖ్యమైన నిర్వచనాలు, సూత్రాలు రివిజన్ చేయాలి. టెక్స్ట్‌బుక్ చాప్టర్ చివరలో ఉండే సమస్యలను మరొక్కసారి రివిజన్ చేసుకోవాలి.

సాంఘిక శాస్త్రంలోని మ్యాప్ పాయింట్‌కు మంచి ప్రాధాన్యత ఇవ్వాలి. పైచార్టు, మ్యాప్ రీడింగ్ ప్రశ్నలను తప్పనిసరిగా రాయాలి. సమకాలీన అంశాల్లో మూస ధోరణులకు ప్రాధాన్యం తగ్గించి, సొంత అవగాహనతో నిత్య జీవిత ఉదాహరణలు అన్వయిస్తూ రాయాలి. ఎస్సీయారిటీ వారు ఇచ్చిన ప్రశ్నాపత్రాలు ప్రాక్టీస్ చేయాలి.సమాచార నైపుణ్యాలపై ఆర్థశాస్త్రంలోని మొదటి మూడు పాఠాలలోని సమాచార పట్టికలు, బార్‌గ్రాఫ్‌ను అధ్యయనం చేస్తే మంచి మార్కులు సాధించొచ్చు. ప్రశ్నాపత్రంలో బాగా వచ్చిన ఏ ప్రశ్నకైనా ముందుగా జవాబు రాయొచ్చు. ఆ ప్రశ్న నంబరును ఎడమవైపు మార్జిన్‌లో తప్పక వేయాలి. ప్రశ్నల నంబర్లు తప్పుగా వేయడం, మరిచిపోవడం చేసేవారు 1శాతం వరకూ ఉంటారు.

ఈ జాగ్రత్తలు పాటించండి

ఒత్తిడికి గురికాకూడదు.

తక్కువ సమయంలో రివిజన్ చేసుకోవాలి

కొత్త అంశాలు నేర్చుకోవడానికి ప్రాధాన్యత ఇవ్వాలి

ఆహారం, నిద్ర, వ్యాయామానికి తగినంత సమయాన్ని కేటాయించాలి

ఎస్టీఆర్టీ ప్రశ్నలనిధి. మాదిరి ప్రశ్నా పత్రాలు ప్రాక్టీస్ చేయాలి

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

సెల్‌ఫోన్, టివి, కంప్యూటర్లకు దూరంగా ఉండాలి

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఎర్ర సిరా ఉండే (బాల్)పెన్ను వాడకూడదు.

నీలం బ్లూ, నలుపు సిరా ఉండే వాటినే ఉపయోగించాలి.

పెద్ద అక్షరాలతో, మరీ ఎక్కువ మార్జిన్ వదిలి భారీగా పేజీలు నింపడం వల్ల ప్రయోజనం శూన్యం.

ప్రతి పుటకు 20-25 వాక్యాలు రాస్తే మేలు.

జవాబులను వ్యాసంలా కాక బుల్లెట్ పాయింట్ల రూపంలో రాయాలి.

రాయాల్సినవన్నీ పూర్తయ్యాకే ఐచ్ఛిక (ఛాయిస్) ప్రశ్నలు రాయడానికి ప్రయత్నించాలి.

కొట్టివేతలు, దిద్దివేతలు ఉండరాదు. బ్రాకెట్‌లో ఒకటి రాసి, మళ్లీ కొట్టివేసి బయట రాయటం మంచిది కాదు.

సాధ్యమైనంత వరకు 10-15 నిమిషాలు ముందే పరీక్ష రాయటం పూర్తిచేయాలి.

రాసిన జవాబులు, ప్రశ్నల నంబర్లను మరోసారి పరిశీలించుకోవాలి.

ఆత్మ విశ్వాసంతో పరీక్షలు రాయండి - విజయాన్ని సాధించండి. అభినందనలతో

# రిసెప్షన్ కు హాజరైన బోరంచు శ్రీకాంత్ రెడ్డి


అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ రిసెప్షన్ కు హాజరైన బోరంచు శ్రీకాంత్ రెడ్డి మావల నందు చిలుకూరి లక్ష్మీ గార్డెన్స్ లో చిలుకూరి విలాస్ రెడ్డి సోదరుడు చిలుకూరి రమేష్ రెడ్డి - సవిత తనయుడు అన్వేష్ రెడ్డి రిసెప్షన్ వేడుకకు హాజరై నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపాడు తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అయన వెంట యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజువేముల, రంజిత్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, రేండ్ల రాజన్న, నవీన్ రెడ్డి



,ఇర్ఫాన్, సమ్ము, అఫ్సర్, కుదురుపాక సురేష్, వెంకటేష్, ఫెరోజ్ ఖాన్ ఉన్నారు.

# స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మహిళలకు రుణ వితరణ.

అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, చిట్యాల శాఖ ఆధ్వర్యంలో నాలుగు స్వయం సహాయక సంఘాల మహిళలకు 60 లక్షల రుణాలను మంజూరు చేసినట్లు జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్ తెలిపారు. మంగళవారం బ్యాంకు ఆవరణలో లబ్దిదారులకు రుణ మంజూరు పత్రాలను బ్యాంకు అధికారులతో కలిసి అందజేశారు. మంజూరైన రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకొని, చిన్న చిన్న వ్యాపారాలు ప్రారంభించి ఆర్థికంగా



ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ పాండు, సిబ్బంది రామకృష్ణ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# రేపటి నుండి ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్
ప్రతీ పరీక్ష కేంద్రం లో సీసీ కెమెరాలు ఏర్పాటు:
విద్యార్థులు అరగంట ముందే పరీక్షా కేంద్రాల కు చేరుకోవాలి:
అరగంట కొకసారి బెల్ :
పరీక్ష కేంద్రాలకు సెల్ ఫోన్లు, ఎలాంటి పరికరాలు అనుమతి లేదు .
గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు:
ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు పరీక్ష:
31 పరీక్షా కేంద్రాలు, 18,880 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయనున్నారు.
ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలి:
టెలి కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం
చేసిన జిల్లా పాలనాధికారి రాజర్షి షా.
విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు వ్రాయాలి:
విద్యార్థులకు ఆల్ ద బెస్ట్ తెలిపిన కలెక్టర్.



ఈ నెల మార్చి 5వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్షలకు సంబంధించి మంగళవారం సంబంధిత అధికారులతో జిల్లా పాలనాధికారి రాజర్షి షా టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ఏర్పాట్ల పై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 5 వ తేదీ నుండి 25 వ తేదీ వరకు జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షలు ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు జరుగుతాయని , ఇంటర్ పరీక్షలకు మొత్తం 18, 880 మంది విద్యార్థులు హాజరు కానుండగా, 31 పరీక్షా కేంద్రాలలో, ప్రథమ సంవత్సరం 9106. ద్వితీయ సంవత్సరం 9774 మొత్తం 18, 880 విద్యార్థులు పరీక్షలు వ్రాయనున్నారని, ఇందుకు 23 మంది చీఫ్ సూపరెండెంట్లు, 23 మంది ఆయా శాఖల అధికారులు, ఫ్లయింగ్ , సిట్టింగ్ స్క్వాడ్స్ లను నియమించడం జరిగిందన్నారు. పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని , గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులకు సమయానుకూలంగా రవాణా సదుపాయం అందుబాటులో ఉండేలా బస్సులు నడిపించాలని, నిరంతర విద్యుత్ సరఫరా కు అంతరాయం కలగకుండా చూడాలని నిర్ణీత సమయానికి సకాలంలో ప్రశ్నపత్రాలు కేంద్రాలకు చేరేలా చర్యలు చేపట్టాలని, పోస్టల్ అధికారులు ప్రశ్నా పత్రాలను జాగ్రత్తగా తరలించాలని, పరీక్షలు ప్రారంభం అయ్యే సమయానికి ముందే విద్యార్థులు తమకు కేటాయించబడిన పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, సెల్ ఫోన్లు , ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్షా కేంద్రాల లో అనుమతి లేదని స్పష్టం చేశారు. పరీక్ష వ్రాసే సమయం లో అరగంట కొకసారి బెల్ మోగుతుందని, పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్ లను మూసి వేయించాలని, 144 సెక్షన్ అమలు, పోలీస్ బందోబస్తు, తదితర ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించడం , ప్రతి పరీక్షా కేంద్రంలోనూ తప్పనిసరిగా తాగునీటి వసతి , ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలను నియమిస్తూ ఫస్ట్ ఎయిడ్ కిట్ తో అందుబాటులో ఉండాలని, కాపీయింగ్ కు ఆస్కారం లేకుండా సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను కట్టుదిట్టమైన పర్యవేక్షణ జరపాలని, ప్రశాంత వాతావరణంలో సజావుగా పరీక్షలు జరిగేలా ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలనీ అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒత్తిడి కి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు వ్రాయాలని, అల్ ది బెస్ట్ తెలిపారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, సబ్ కలెక్టర్ యువరాజ్, dieo గణేష్, , జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారిణి అదిలాబాద్ గారి చే జారీ చేయనైనది.

# ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాల వద్ద 163 బి ఎన్ ఎస్ ఎస్ అమలు.

**రేపటి నుండి ఈనెల 25 వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు.**

**31 పరీక్ష కేంద్రాలలో, 18880 మంది విద్యార్థులు రాయనున్న పరీక్షలు.**

**ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 వరకు పరీక్ష.**

**పరీక్ష కేంద్రం వెలుపల ప్రాంతంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు.**

**జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ఐపిఎస్.**




అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : రేపటినుండి ఈనెల 25వ తారీకు వరకు జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్ష లు ప్రారంభమవుతున్న సందర్భంగా పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాలలో 163 బిఎన్ఎస్ఎస్ సెక్షన్ అమల్లో ఉ ంటుందని జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ఐపిఎస్ ఒక పత్రిక ప్రకటన ద్వారా తెలియజేశారు. పరీక్ష కేంద్రాల వెలుపల ప్రాంతాలలో పోలీసు సిబ్బంది బందోబస్తులో ఉంటారని తెలియజేశారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో జిరాక్స్ సెంటర్లను, ఇంటర్నెట్ సెంటర్లను మూసి ఉంచాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. అదేవిధంగా పరీక్ష కేంద్రాల లోనికి సెల్ఫోన్లో ఎదర ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా 31 పరీక్ష కేంద్రాలలో 18880 మంది విద్యార్థులు పరీక్షలను రాస్తున్నట్లు తెలియజేశారు. ఉ దయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పరీక్షలు నిర్వహించబడతాయని తెలిపారు. విద్యార్థులు వీలైనంత త్వరగా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని తెలియజేశారు. పరీక్ష కేంద్రం లోపల సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటుచేసి నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుంది తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద ప్రజలు 500 మీటర్ల వరకు గుమ్మిగూడి ఉండకుండా ఉండాలని తెలిపారు. పరీక్షా కేంద్రం లోనికి వెళ్లే సమయంలో ప్రధాన గేటు వద్ద జిల్లా పోలీసులు బృందం తనిఖీ నిర్వహిస్తుందని వారికి సహకరించాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి సౌండ్ సిస్టలకు అనుమతి లేదు. పరీక్ష కేంద్రాల వద్ద గల మైదానాలలో ఎలాంటి క్రీడలకు అనుమతి లేదు,


వాటిలో ఇతరులకు అనుమతి ఉండదు. పట్టణంలో ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు ఎదురకుండా ట్రాఫిక్ సిబ్బందితో పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులందరూ పరీక్షలలో తమ ఉత్తమ ప్రతిభ కనబరచాలని ముందుగా అందరికీ శుభాభినందనలు తెలియజేశారు.

# బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్తుల ఆందోళన..




ముధోల్ :అమృత్ తెలంగాణ: ముధోల్ మండలంలోని బోరేగాం- కారేగాం గ్రామ మధ్యలో రోడ్డుపై ఉన్న లో లెవల్ వంతెనను తొలగించి, బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్తులు మంగళవారం ఆందోళనకు దిగారు. ముధోల్ నుండి వట్టోలి వరకు కేంద్ర ప్రభుత్వ నిధులతో డబుల్ రోడ్డు నిర్మాణ పనులు కొన సాగుతున్నాయి. అయితే లో లెవెల్ వంతెన పై సిసి రోడ్ వేయటానికి కాంట్రాక్టర్ సన్నాహాలు చేయడంతో ఈవిషయం తెలుసుకున్న గ్రామస్తులు అక్కడికి వెళ్లి తమ నిరసన వ్యక్తం చేశారు. పాత లో లెవెల్ వంతెనకు పూతలు వేయటం సరికాదని గ్రామస్తులు మండిపడ్డారు. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో భారీ వర్షాలు పడినప్పుడు లో లేవల్ వంతెన పై నుండి భారీ స్థాయిలో వర్షపు నీరు ప్రవహించడంతో తమ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయ అన్న విషయాన్ని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. శాశ్వత పరిష్కారాన్ని చూపాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. లో లెవెల్ వంతెనకు 5 వరుసలు వర్షపు నీరు ప్రవహించడానికి భారీ పైపులైన్ వేయాలి.లేదాబ్రిడ్జి అయిన నిర్మించాలని గ్రామస్తులు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. తమ సమస్యను పట్టించుకోకపోతే ఊరుకునేది లేదని వారు హెచ్చరించారు. ఈ విషయం తెలుసుకున్న రోడ్డు భవనాల శాఖ డిఈఈ సునీల్ గ్రామస్తులతో మాట్లాడారు. ఈ సమస్యను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. దీంతో గ్రామస్థులు శాంతించారు.

# బాలీవుడ్ లో బడా నిర్మాణ సంస్థలో మాళవిక



సినిమా తమిళ నటి మాళవిక మోహనన్ ఇప్పటివరకు తెలుగు సినిమాల్లో నటించింది లేదు. కానీ తెలుగు ఆడియన్స్ ను మాళవిక సుపరిచితురాలే. తమిళ నటి మాళవిక మోహనన్ ఇప్పటివరకు తెలుగు సినిమాల్లో నటించింది లేదు. కానీ తెలుగు ఆడియన్స్ ను మాళవిక సుపరిచితురాలే. మాళవిక నటించిన ఎన్నో డబ్బింగ్ సినిమాలను తెలుగు ఆడియన్స్ ఇప్పటికే చూసేశారు. మాళవిక ఇండస్ట్రీలోకి వచ్చి ఆల్రెడీ పదేళ్లు దాటుతోంది. పదేళ్ల తర్వాత అమ్మడు ఇప్పుడు తెలుగులో సినిమా చేస్తుంది. మారుతి దర్శకత్వంలో పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న ది రాజా సాబ్ సినిమాలో మాళవిక లీడ్ రోల్ లో నటిస్తోంది. రాజా సాబ్ తర్వాత మాళవికకు తెలుగులో మరిన్ని ఛాన్సులు క్యూ కడతాయని అందరూ అంటున్నారు. ఇదిలా ఉ ంటే మాళవిక గతేడాది యుద్ర అనే సినిమాతో బాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. సిద్దాంత్ చతుర్వేది హీరోగా రూపొందిన ఈ సినిమా అనుకున్న స్థాయిలో ఆడియన్స్ ను మెప్పించలేకపోయింది. ఇదిలా ఉంటే మాళవిక ఇప్పుడు మరో బాలీవుడ్ సినిమాకు సైన్ చేసిందని వార్తలు వినిపిస్తున్నాయి. రొమాంటిక్ కామెడీ జానర్ లో రూపొందనున్న ఓ భారీ ప్రాజెక్టుకు మాళవిక సైన్ చేసినట్టు తెలుస్తోంది. ఓ భారీ నిర్మాణ సంస్థ ఈ సినిమాను నిర్మించనుందని టాక్ వినిపిస్తోంది.

# రవితేజ.. పర్ఫెక్ట్ పండగ ప్లాన్



మాస్ మహారాజా రవితేజ ప్రస్తుతం తన కెరీర్‌ను మళ్లీ ట్రాక్‌లోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాడు. ఇటీవల వరుస అపజయాలతో వెనుకబడ్డ రవితేజ, తన తదుపరి సినిమాలకు చాలా జాగ్రత్తగా స్క్రిప్టులు ఎంపిక చేసుకుంటున్నాడు. మాస్ జాతర అనే హై వోల్టేజ్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌తో త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. అయితే, తాజాగా మరో ఇంట్రెస్టింగ్ అప్డేట్ ఫిలింనగర్‌లో చక్కర్లు కొడుతోంది. రవితేజ కూడా వెంకటేష్ తరహాలో టార్గెట్ సెట్ చేసుకున్నట్లు తెలుస్తోంది.


ఇటీవల వెంకటేష్ – అనిల్ రావిపూడి కాంబినేషన్లో వచ్చిన సంక్రాంతికి వస్తున్నాం సినిమా ఏ రేంజ్ లో హిట్ అయ్యిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. వెంకీ కెరీర్ లో బిగ్గెస్ట్ గ్రాసర్ గా 300 కోట్లకు పైగా కలెక్షన్స్ రాబట్టడం విశేషం. ఈ సినిమా సక్సెస్ కావడానికి కాంబినేషన్ ఒక కారణమైతే రిలీజ్ స్లాట్ మరో ముఖ్యమైన రీజన్. ఇక రవితేజ కూడా వచ్చే ఏడాది సంక్రాంతి బరిలోకి దిగబోతున్నాడట. సాధారణంగా సంక్రాంతి టాలీవుడ్‌కు బిగ్గెస్ట్ సీజన్. ప్రతి పెద్ద హీరో తన సినిమాను ఈ పండగ సీజన్‌లో రిలీజ్ చేయాలని చూస్తాడు.

ఇప్పటివరకు ఎన్టీఆర్–ప్రశాంత్ నీల్, చిరంజీవి–అనిల్ రావిపూడి ప్రాజెక్ట్‌లు ఈ ఫెస్టివల్ సీజన్ కోసం లైన్‌లో ఉన్నాయి. ఇప్పుడు ఈ పోటీకి మాస్ మహారాజా కూడా జాయిన్ అవుతుండటంతో సినిమాపై మరింత ఆసక్తి పెరిగింది. సంక్రాంతి సక్సెస్ రేషియోలో ఉన్న అనిల్ ఈసారి చిరంజీవితో వస్తున్నారు కాబట్టి ఆ సినిమాకు పోటీగా నిలవడం అంత ఈజీ కాదు. అయితే రవితేజ కూడా ఓ ప్లానింగ్ తోనే వస్తున్నాడు. తన కొత్త సినిమాను క్లాస్ మేకర్ కిషోర్ తిరుమల దర్శకత్వంలో చేయబోతున్నాడనే న్యూస్ కన్ఫర్మ్ అయింది. కిషోర్ తిరుమల సినిమాలకు యూత్, ఫ్యామిలీ ఆడియన్స్‌లో మంచి క్రేజ్ ఉంటుంది.

నేను శైలజ, చిత్ర లహరి వంటి ప్రాజెక్ట్స్‌తో తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్ క్రియేట్ చేసుకున్న దర్శకుడు, రవితేజతో కలిసి ఏ తరహా కథను తీసుకురాబోతున్నాడనేది ఆసక్తికరంగా మారింది. ఇప్పటి వరకు రవితేజ మాస్ యాక్షన్ పాత్రలలోనే ఎక్కువ కనిపించాడు. అయితే, ఈసారి మాత్రం ఫ్యామిలీ, ఎమోషనల్ ఎలిమెంట్స్ కూడా ఉండేలా స్క్రిప్ట్‌ను ప్లాన్ చేసినట్లు సమాచారం. దీంతో ఇది సంక్రాంతికి పర్ఫెక్ట్ సినిమా అవుతుందనే ఆలోచనలో ఉన్నారట.

వెంకటేష్ తరహాలోనే మాస్ రాజా కూడా సంక్రాంతి టైమ్ లో సీజన్ కు తగ్గ కాంటెంట్ తో హిట్టు కొట్టాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ సినిమాను సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నాడు. గతంలో దసరా, రామారావు ఆన్ డ్యూటీ లాంటి సినిమాలను నిర్మించిన ఈ నిర్మాత ఇప్పుడు రవితేజ – కిషోర్ ప్రాజెక్టును కూడా గ్రాండ్ గా నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. మాస్, క్లాస్ మిక్స్‌గా రూపొందనున్న ఈ సినిమా, సంక్రాంతి రిలీజ్ కోసం ముందుగానే ప్లాన్ చేయబడింది.

# ఎప్పుడు ఏ వైపు నుంచి ఫోటో తీస్తారో తెలీదు!



ఇటీవలి ఇంటర్వ్యూలో ఆమె శరీర తత్వం, దాంతో పాటే వచ్చిన ఇమేజ్‌ని మేనేజ్ చేయాల్సిన అవసరం గురించి మాట్లాడింది. బాడీ ఇమేజ్‌తో తన కష్టాల గురించి ఎప్పుడూ ఓపెన్‌గా చెప్పే నటి సోనాక్షి సిన్హా, తన అధిక బరువు గురించి ఎప్పుడూ ఓపెన్ గా మాట్లాడుతుంది. ప్లస్ సైజ్ తనకు ఎప్పుడూ అడ్డంకి కాదని ధైర్యంగా చెబుతుంది. ఇటీవలి ఇంటర్వ్యూలో ఆమె శరీర తత్వం, దాంతో పాటే వచ్చిన ఇమేజ్‌ని మేనేజ్ చేయాల్సిన అవసరం గురించి మాట్లాడింది. దీని కారణంగా పబ్లిక్ లో గోప్యత విషయమై గందరగోళం నెలకొంటుందని, భారతదేశంలో ఈ విషయంపై జాగ్రత్త వహించాలని సోనాక్షి అంది. అలాగే తాను భారతదేశంలో స్విమ్మింగ్‌ను ఎందుకు ఇష్టపడను?అనే విషయాన్ని కూడా మాట్లాడింది. ఈత దుస్తులను ధరించేటప్పుడు.. ముఖ్యంగా పెరిగే వయసులో నేను ఎల్లప్పుడూ స్పృహతో ఉన్నాను. నేను ముంబయిలో లేదా ఈ దేశంలో ఈత కొట్టను.ఎందుకంటే ఎవరైనా రహస్యంగా ఫోటో తీసి ఎప్పుడు ఎక్కడికి పంపుతారో నాకుతెలియదు. ఇది ఇంటర్నెట్‌లో షికార్ చేయడం నాకు ఇష్టం లేదు. నేను భారతదేశం వదిలి ఎక్కడికైనా వెళ్లినప్పుడుఈతకొడతాను.అనిస్పష్టంగా చెప్పింది. సినిమాఈ భయంవెనక ఏదోఒకకారణం ఉంటుంది.అలాగే నన్ను బరువుతగ్గాలనిఅమ్మఎప్పుడూ చెబుతూ ఉండేదని, కానీదానికి విరుద్ధంగా చేయడానికి ఇష్టపడేదానిని అని కూడా సోనాక్షి తన మొండితనం గురించి చెప్పింది.చిన్న పిల్లలుగా మనస్తత్వాలు అలా ఉంటాయి. కానీ మా అమ్మ నాకు చెప్పడం మానేసిన రోజునే నా బరువు గురించి నేను ఏదైనా చేయాల్సిన అవసరం ఉందని నాకు అనిపించిందని తెలిపింది.




# బికినీ బ్యూటీ సోనాల్ పర్ఫెక్ట్ టోన్డ్ లుక్



బాలయ్య–బోయపాటి కాంబినేషన్ సినిమాల్లో నటించిన ఈ ముంబై బ్యూటీ కెరీర్ లో కొన్ని చెప్పుకోదగ్గ బ్లాక్ బస్టర్లను అందుకుంది సోనాల్ చౌహాన్ పరిచయం అవసరం లేదు. బాలయ్య–బోయపాటి కాంబినేషన్ సినిమాల్లో నటించిన ఈ ముంబై బ్యూటీ కెరీర్ లో కొన్ని చెప్పుకోదగ్గ బ్లాక్ బస్టర్లను అందుకుంది. అయితే సక్సెస్ ఉన్నా ఈ భామకు ఏదీ కలిసి రాలేదు. ప్రభాస్ ఆదిపురుష్ చిత్రంలో అతిథి పాత్రలో కనిపించిన ఈ బ్యూటీ బంగ్లాదేశ్ కి చెందిన ప్రముఖ పంపిణీదారుడు నిర్మిస్తున్న ఓ సైకలాజికల్ థ్రిల్లర్ మూవీలో ఛాన్స్ కల్పించాడు. థర్డ్ పేరుతో ఈ మూవీ డాలీవుడ్ (బంగ్లాదేశ్) లో విడుదల కావాల్సి ఉంది. అయితే దానికి సంబంధించిన సరైన అప్ డేట్ లేదు. సౌత్ లో అన్ని పరిశ్రమలతో సంబంధాలు ఉన్నా, హిందీ పరిశ్రమను సోనాల్ ఎప్పటికీ వదిలిపెట్టదు. తాజాగా సోనాల్ చౌహాన్ షేర్ చేసిన ఫోటోషూట్ ఒకటి అంతర్జాలంలో సునామీ స్పీడ్ తో దూసుకుపోతోంది. సోనాల్ మతిచెడే బికినీ ఫోటోషూట్ లో టోన్డ్ లుక్ తో ఆకట్టుకుంది. తన కళ్లకు అందమైన బ్లాక్ రేబాన్ ని ధరించి మోడ్రన్ టచ్ ఇచ్చింది. బికినీపై మెస్సీ స్లిప్ ఆన్ డ్రెస్ ధరించిన చౌహాన్ రకరకాల భంగిమల్లో ఫోజులిచ్చింది. సోనాల్ స్పెషల్ ఫోటోషూట్ వేగంగా యూత్ లోకి దూసుకెళుతోంది. వరుస ఫోటోషూట్లతో గ్యాప్ లెస్ గా సోనాల్ ప్రయత్నం చూసి, తిరిగి టాలీవుడ్ అవకాశాలు కల్పిస్తుందేమో చూడాలి.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com